# నేటి నుంచి పర్యాటక వారోత్సవాలు

## పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 17:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ సంపదను, పర్యాటక శోభను ప్రపంచానికి చాటిచెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 (సోమవారం) నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో... భాషా సాంస్కృతిక, పురావస్తు (హెరిటేజ్) శాఖలు, నిథమ్ సంస్థల సంయుక్త సమన్వయంతో ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. వారోత్సవాల ప్రారంభం సందర్భంగా పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 10:00 గంటలకు: జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో అడ్మిషన్లు, కెరీర్ గైడెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 4:00 గంటలకు: అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని స్టేట్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారు. ఇదే వేదికపై కొలనుపాక సైట్ మ్యూజియం, అలంపూర్ సైట్ మ్యూజియం ప్రత్యేక బ్రోషర్లతో పాటు, టూరిస్ట్ గైడ్ ఇన్ తెలంగాణ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరిస్తారు. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యం. ఎకోటూరిజం ప్రదేశాలను ప్రమోట్ చేయడంతో పాటు, పర్యాటక రంగం ద్వారా యువతకు లభించే ఉపాధి అవకాశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నారు. వారోత్సవాల ప్రత్యేక ఆకర్షణలు హెరిటేజ్ వాక్‌లు: చారిత్రక కట్టడాల ప్రాశస్త్యాన్ని వివరించేలా ప్రత్యేక కార్యక్రమాలు. స్వచ్ఛత కార్యక్రమాలు: ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత డ్రైవ్‌లు. డిజిటల్ ప్రచారం: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లతో ప్రత్యేక కార్యక్రమాలు. అవగాహన సదస్సులు: జిల్లా స్థాయిల్లో పర్యాటక ప్రాధాన్యతపై ప్రత్యేక సదస్సులు, ప్రచారాలు ఉంటాయి.

# రాష్ట్రంలోని సబ్‌స్టేషన్ల వద్ద సోలార్ ప్లాంట్లు

## పైలట్ ప్రాజెక్టు కింద 9 ఉమ్మడి జిల్లాల్లో అమలు


**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా పైలట్ ప్రాతిపదికన సోలారైజేషన్ ప్రాజెక్ట్ కింద రాష్ట్రంలోని 9 ఉమ్మడి జిల్లాల పరిధిలోని 18 సబ్‌స్టేషన్లలో (33/11 కేవీ) మొత్తం 19 మెగావాట్ల సామర్థ్యం గల గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ ప్రాజెక్టును రూ. 66.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ కోసం అయ్యే రూ.66.50 కోట్ల నిధులను ఆయా డిస్కామ్‌లే భరించనున్నాయి. టీజీఎస్పీడీసీఎల్ 8 సబ్‌స్టేషన్లలో 8 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేస్తారు. టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో 10 సబ్‌స్టేషన్లలో 11 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు నోడల్ ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీగా టీజీరెడ్కో వ్యవహరించనుంది. కాంపిటేటివ్ బిడ్డింగ్ ప్రాసెస్ ద్వారా ఈపీసీ కాంట్రాక్టర్లను ఎంపిక చేయనున్నారు. కాగా తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ప్రకారం 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి రాష్ట్రంలో 20వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే 2047 నాటికి నెట్ జీరో (కర్బన ఉద్గారాల రహిత) లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా లోడ్ సెంటర్లకు సమీపంలోనే సోలార్ పవర్ ప్లాంట్లను అభివృద్ధి చేయాలనే దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, నల్గొండ, మెదక్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, ఆదిలాబాద్, తదితర ఉమ్మడి జిల్లాల్లోని 18 సబ్‌స్టేషన్ల పరిధిలో 73.25 ఎకరాల భూమిలో 19 మెగావాట్ల సామర్థ్యంతో ఈ పైలట్ ప్రాజెక్టును అమలు చేయనుంది.

# రాష్ట్రంలో హైడ్రో ప్రాజెక్టులకు కేంద్ర సాయం

## దేశవ్యాప్తంగా రూ.2,584 కోట్లతో స్మాల్ హైడ్రో స్కీమ్

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా 25 మెగావాట్ల వరకూ సామర్థ్యం గల చిన్న జల విద్యుత్ ప్రాజెక్టుల (స్మాల్ హైడ్రో పవర్) అభివృద్ధి కోసం కేంద్రం రాష్ట్రాలకు ఆర్థిక సాయాన్ని అందించనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి స్మాల్ హైడ్రో పవర్ డెవలప్‌మెంట్ స్కీం అమలుకు కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ) పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.

2026-27 నుంచి 2030-31 వరకు ఐదేళ్ల కాలానికి గాను మొత్తం రూ.2,584.60 కోట్ల భారీ బడ్జెట్ నిధులతో ఈ పథకం అమలు కానుంది. దీని ద్వారా దేశంలో దాదాపు 1,500 మెగావాట్ల అదనపు జలవిద్యుత్ సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, నిర్మాణ దశలో 51 లక్షల పనిదినాల ఉపాధిని, 9,000 శాశ్వత ఉద్యోగాలను సృష్టించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే ఏటా సుమారు 43 లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించి పర్యావరణాన్ని రక్షించవచ్చని అంచనా వేసింది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ పథకానికి జాతీయ కార్యక్రమ అమలు సంస్థగా వ్యవహరిస్తుంది. మొత్తం బడ్జెట్లో అలాగే చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల కేంద్ర ఆర్థిక సహాయం కోసమే రూ.2,532.60 కోట్లు కేటాయించారు. ఈ పథకం కింద తెలంగాణ సహా ఇతర సాధారణ రాష్ట్రాల్లో నిర్మించే 1 నుండి 5 మెగావాట్ల ప్రాజెక్టులకు మెగావాట్లకు రూ. 1.78 కోట్లు, 5 నుండి 25 మెగావాట్ల ప్రాజెక్టులకు మెగావాట్లకు రూ. 2.054 కోట్ల చొప్పున 20 శాతం నిధుల సబ్సిడీ (గరిష్టంగా ప్రాజెక్టుకు రూ. 20 కోట్లు) లభిస్తుంది.



నిరుద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్, వై.నాగేశ్వరరావు, గంజి ప్రసాద్, నూకాలమ్మ, సి.రాజేందర్, సతీష్, అంజీ, అనంతయ్య తదితరులు

# రెండు లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి

## వారంలోగా నోటిఫికేషన్లు విడుదల చేయకపోతే సిఎం ఇంటి ముట్టడి : ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 17, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 18 వేల పోస్టులు, 30 వేల టీచర్‌పోస్టులు, అలాగే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న మొత్తం 2 లక్షల ఉద్యోగాలను ఎన్నికల వాగ్దానం మేరకు భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లోగా ప్రభుత్వం నోటిఫికేషన్ లను విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టి సిఎం ఇంటిని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన నిరుద్యోగ జెఎసి సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి నిరుద్యోగులే కారణమని, హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులను పట్టించుకోలేదని ఆరోపించారు. సమావేశంలో ఎపి బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు వై.నాగేశ్వర్ రావు, ఇంచార్జి నూకాలమ్మ, రాష్ట్ర నాయకులు సి.రాజేందర్, జిల్లపల్లి అంజీ, అనంతయ్య, పగిళ్ల సతీష్, నిఖిల్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల గుర్తింపునకు త్వరలో అఖిలపక్ష సమావేశం

## జిల్లా పర్యటనలు చేసి ప్రజల అభిప్రాయ సేకరణ

## ఉద్యమకారులను గుర్తించడానికి 4 రకాల ప్రతిపాదనలు

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ మొదటి సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అమరవీరుల గుర్తింపు కోసం త్వరలో ఆల్ పార్టీ సమావేశం ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ నిర్ణయించింది. కమిటీ చైర్మన్ కేశవరావు అధ్యక్షతన ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తొలి సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు ప్రభుత్వం అధికారికంగా కమిటీ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమావేశం ధన్యవాదాలు తెలిపింది. అమరవీరుల జ్యోతి కింద ఉన్న ఆఫీస్‌లో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కార్యాలయం ఏర్పాటు చేసేలా కమిటీలో నిర్ణయం తీసుకున్నారు. అమరవీరుల గుర్తింపు కోసం త్వరలో ఆల్ పార్టీ సమావేశం ఏర్పాటు చేసి వారి దగ్గర ప్రతిపాదనలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, 1969 ఉద్యమకారులు, ఉద్యోగ సంఘాలు, కళాకారుల జెఎసి, సబ్బండ వర్గాల జెఏసీ, కుల సంఘాల, న్యాయవాదులు జేఏసీ, జిల్లాల్లో ఏర్పడిన ఉద్యమ సంఘాలు వారి నుండి ప్రతిపాదనలు తీసుకోవాలని నిర్ణయించారు. కమిటీ జిల్లా పర్యటనలు చేసి విస్తృతంగా ప్రజల అభిప్రాయ సేకరణ చేయాలని నిర్ణయించింది. ఉద్యమకారులను గుర్తించడానికి నాలుగు రకాల ప్రతిపాదనలను సమావేశంలో కమిటీ సిద్ధం చేసింది. తెలంగాణ ఉద్యమంలో చనిపోయిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఉద్యమంలో గాయపడిన వారికి రెండవ కేటగిరిగా తీసుకోవాలని, తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్లినవారు, అరెస్టయిన వారు, తెలంగాణ ఉద్యమ కేసులు అయిన వారు మూడవ కేటగిరిగా తీసుకోవాలని ప్రతిపాదించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుండి క్షేత్రస్థాయిలో ఉద్యమం చేసిన వారిని నాలుగవ కేటగిరిగా తీసుకోవాలని ప్రతిపాదించారు. నాలుగవ కేటగిరి గుర్తించడానికి వారు ఉద్యమంలో చేసిన పేపర్ కటింగ్స్ చూడాలని నిర్ణయించారు. తెలంగాణ ఉద్యమంలో పౌరసమాజం లో ఉండి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారి నుండి ప్రతిపాదనలు తీసుకోవాలని, 1969, 1972, 1996 ఉద్యమకారులతో సమావేశమై ప్రతిపాదనలు తీసుకోవాలని నిర్ణయించారు. తెలంగాణ ఉద్యమ అస్తిత్వాన్ని కాపాడేందుకు ఈ కమిటీ ఏర్పాటు చేసిందని రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల ఎంపిక జరుగుతుందని కమిటీ స్పష్టం చేసింది. గత ప్రభుత్వంలో కొంత మందికి మాత్రమే సహాయం అందించారని.. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా పార్టీలకు అతీతంగా ఎంపిక చేయాలని కమిటీ నిర్ణయించింది. ఉద్యమకారుల కమిటీ ప్రతిపాదించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ నుండి రాగానే ధన్యవాదాలు తెలిపి కమిటీ ప్రతిపాదించిన అంశాలపై చర్చించాలని కమిటీ నిర్ణయం తీసుకుంది.

# టమాటా ధరలు పైపైకి..

## కిలో ధర రూ.60కి చేరిన వైనం

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** నిన్న, మొన్నటివరకు మార్కెట్‌లో కిలో రూ. 20 ధర పలికిన టమాట ఇప్పుడు భారీగా పెరిగింది. వంటగదిలో కూర ఏదైనా సరే టమాటా లేనిదే ముద్ద దిగని సామాన్యుడికి ఇప్పుడు ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. మొన్నటిదాకా పాతాళంలో ఉన్న టమాటా రేటు ఇప్పుడు ఒక్కసారిగా డబుల్ అయి కూర్చుంది. హైదరాబాద్‌లోని ప్రధాన మార్కెట్లలో ప్రస్తుతం కిలో టమాటా ధర రూ.40 నుంచి రూ.60 వరకు పలుకుతోంది. దీంతో మార్కెట్‌కు వెళ్తున్న వినియోగదారులు టమాటా ధర విని అవాక్కవుతున్నారు. కిలోలు కిలోలు కొనేవాళ్లంతా ఇప్పుడు అరకిలో, పావుకిలోతో సరిపెట్టుకుం టున్నారు.

మార్కెట్‌లో టమాటాలకు డిమాండ్ బాగానే ఉన్నా, దానికి తగినట్టుగా సప్లై లేకపోవడమే ఈ ధరల మంటకు అసలు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. గత నెలలో టమాటా ధరలు దారుణంగా పడిపోయాయి. దీంతో పెట్టుబడులు కూడా రాక నష్టపోయిన రైతులు చాలా చోట్ల పంట కోయడమే ఆపేశారు. కొత్తగా సాగు చేయడం కూడా తగ్గించేశారు. దీని ప్రభావం ఇప్పుడు మార్కెట్‌పై పడింది. సరుకు రాక ఒక్కసారిగా ధరలు పైపైకి దూసుకెళ్లాయి. ప్రస్తుతానికి మార్కెట్లోకి వచ్చే టమాటా లారీల సంఖ్య బాగా తగ్గిపోవడంతో ఈ డిమాండ్ ఏర్పడింది. రానున్న రోజుల్లో కూడా సరఫరా ఇలాగే తక్కువగా ఉంటే టమాటా ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

# డిక్లరేషన్ల పేరిట హామీలిచ్చి జనాన్ని మోసగించిన ప్రభుత్వం

## సన్నవడ్లకు బోనస్ పూర్తిగా ఎందుకు ఇవ్వడం లేదు?: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన డిక్లరేషన్‌లు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. కనీసం ధాన్యం కొనలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదని, తన నిర్లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం మీద, అధికారుల మీద నెట్టేసే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. రైతు రుణమాఫీ పూర్తి చేయలేదు, రైతు కూలీలకు, కౌలు రైతులకు హామీ ఇచ్చి మోసం చేసిందని, లక్షల మంది రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల బ్యాంకుల్లో డీఫాల్టర్లుగా మారారన్నారు. రైతులు అనేక ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు మీద చాలా ఇతోధికంగా అండగా నిలబడుతున్నప్పటికీ ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ యూపిఏ హయాంలో రూ.1300 రూపాయలు క్వింటాలుకు గిట్టుబాటు ధర ఉండేది. కానీ మోడీ ప్రభుత్వం గిట్టుబాటు ధరను ఇప్పుడు ఎంతవరకు(దాదాపు రూ.2360) పెంచిందో ఒక్కసారి ఆలోచించాలన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఎదురుదాడులపైనే దృష్టి పెడుతున్నారు తప్ప క్షేత్రస్థాయిలో సజావుగా కొనుగోళ్లు ఎందుకు చేయడం లేదో చెప్పలేని పరిస్థితి. ఈసారి కూడా దిగుబడి పెరిగింది, దానికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టుకోవాల్సి ఉండాలన్నారు. దాదాపు 10 పంటలకు ప్రతి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చి పంట కొనుగోలు చేస్తామని చెప్పారన్నారు. చివరికి సన్నవడ్లకే ఇస్తామని చెప్పి, అందులో కూడా సగానికి కూడా ఇవ్వడం లేదు. ధాన్యం కొనుగోలుకు ప్రతి పైసా కేంద్రమే ఇస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం మీద ఒక్క రూపాయి భారం కూడా పడదు. బస్తాలు, ట్రాన్స్ పోర్ట్, చెల్లించే డబ్బుకు రుణం, దానికి వడ్డీ, గోదాముల్లో పెట్టేందుకు రెంటుకు కానీ, మొత్తం కేంద్రమే భరిస్తున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లు ఎందుకు ఆలస్యం చేస్తుందో చెప్పాల్సిన అవసరం ఉన్నది. తన అసమర్థత, వైఫల్యాలను ఇతరులపైకి పాస్ ఆన్ చేస్తూ.. కేంద్రంపై దుష్ప్రచారాలు చేస్తుంది తప్ప రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం న్యాయం చేయడం లేదన్నారు. ప్రతి కేజీ బియ్యంపై కేంద్ర ప్రభుత్వం రూ.40 ఖర్చు చేస్తుంది. రైతులను ఆదుకుంటూనే 83 కోట్ల మంది ప్రజలకు 5 కేజీల చొప్పున బియ్యం ఉచితంగా కేంద్రం ఇస్తున్నది. ఈ ప్రభుత్వం ఫోజుకొడుతున్న సన్నబియ్యం పంపిణీలో కూడా 60 శాతం ఖర్చు కేంద్రానిదే అన్నారు. ఇది కాదని రేవంత్ రెడ్డి చెప్పగలరా? అని నేను ఛాలెంజ్ చేస్తున్నాను? ప్రపంచంలోనే భారత ప్రభుత్వం లార్జెస్ట్ ఫ్రీ ఫుడ్ డిస్ట్రిబ్యూషన్ స్కీమ్ అమలు చేస్తున్నారు. మరే దేశంలో ఇలాంటి పథకం లేదు. మోదీ ఈ పథకం అందిస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వంపై బిఆర్ఎస్ అబండాలు మోపే ప్రయత్నం చేస్తే.. నేడు కాంగ్రెస్ కూడా అదే చేస్తుందన్నారు. పత్తి పంట విషయంలో కూడా క్వింటాలుకు రూ.8660 మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో బిఆర్ఎస్ ఫసల్ బీమా యోజనను అమలు చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయడం లేదు. అత్యధికంగా తెలంగాణలో ధాన్యం ఉత్పత్తి అవుతున్నది. కేంద్రం కొనుగోలుకు ముందుకు వచ్చినప్పుడు రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# విడిభాగాల ధరల నియంత్రణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

## ఎఎస్ఆర్‌టియు చైర్మన్ వై.నాగిరెడ్డి

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** ప్రపంచ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో స్పేర్ పార్ట్స్ ధరల నియంత్రణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఏఎస్ఆర్‌టియు) నిర్ణయించింది. ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీ వేదికగా ఏఎస్ఆర్‌టియు అఖిల భారత సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి అసోసియేషన్ చైర్మన్, టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అధ్యక్షత వహించగా.. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల ఆర్టీసీల చైర్మన్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీలు) ఉన్నతాధికారులు పాల్గొని రవాణా రంగ పురోగతిపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ప్రధానంగా ఆర్టీసీ సంస్థలకు స్పేర్ పార్ట్స్ సరఫరా చేసే వెండర్స్‌తో కీలక భేటీ జరిగింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా విపరీతంగా పెరుగుతున్న స్పేర్ పార్ట్స్ ధరలను ఎలా అధిగమించాలనే అంశంపై అసోసియేషన్ చైర్మన్ నాగిరెడ్డి కీలక సూచనలు చేశారు. పెరిగిపోతున్న ధరల స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు, ఆర్టీసీలపై ఆర్థిక భారం పడకుండా చూసేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడుతూ... దేశంలోనే మొట్టమొదటిసారిగా కాలుష్య నివారణకు తెలంగాణలో విద్యుత్ (ఎలక్ట్రికల్) బస్సులను విజయవంతంగా నడుపుతున్నట్లు వివరించారు. విద్యుత్ బస్సుల సమర్థవంతమైన నిర్వహణలో టీజీఎస్ ఆర్టీసీ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని పర్యావరణ అనుకూల విద్యుత్ బస్సులను తీసుకువచ్చి, హైదరాబాద్ నగరాన్ని పూర్తి కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా రవాణా రంగంలో సమాచార సాంకేతిక పరిజ్ఞానం (ఐటీ) వినియోగంలో టీజీఎస్ ఆర్టీసీ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ప్రధానంగా సంస్థకు గుండెకాయ లాంటి ఆర్టీసీ గ్యారేజీల నిర్వహణలో అధునాతన సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. వాహనాల ఫిట్‌నెస్, విడిభాగాల లభ్యత, మెయింటెనెన్స్ షెడ్యూళ్లను పూర్తి డిజిటల్ పద్ధతిలో పర్యవేక్షించడం ద్వారా బస్సుల సామర్థ్యం పెరగడమే కాకుండా, ప్రయాణీకులకు మరింత సురక్షితమైన, నమ్మకమైన సేవలు అందుబాటులోకి వస్తున్నాయని వెల్లడించారు. తెలంగాణలో మహిళల కోసం విజయవంతంగా అమలవుతున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం గురించి చైర్మన్ సదస్సులో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ పథకం ద్వారా అనతికాలంలోనే రికార్డు స్థాయిలో 10 వేల కోట్ల ప్రయాణాలనుపూర్తి చేసి, రవాణా రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించిన తెలంగాణ ఆర్టీసీని సమావేశంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, అధికారులు అభినందించారు.

# ఐ బొమ్మ మళ్లీ ప్రత్యక్షం!

## కొత్త సినిమాలు సైతం బప్పం టివి, ఐ బొమ్మలో ప్రసారం

## సైబర్ క్రైం పోలీసులకు ఫిలిం ఛాంబర్ ఫిర్యాదు

## తన ప్రమేయం లేదన్న ఇమంది రవి

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త :** నాలుగు నెలల క్రితం రట్టయి, పోలీసుల చర్యలతో మూతపడ్డ ఐ బొమ్మ, బప్పం టివిలు మరోసారి వెబ్ సైట్‌లలో ప్రత్యక్షమవడం, కొత్తగా విడుదలైన సినిమాలు అందులో వస్తుండడం సినీ వర్గాలలో కలకలం రేపింది. దీనిపై ఫిలింఛాంబర్ నిర్వాహకులు ఆదివారం నాడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు ఇందులో తన ప్రమేయం లేదని గతంలో ఐ బొమ్మ, బప్పం టివిల నిర్వాహకుడుగా వున్న ఇమంది రవి మీడియాకు తెలిపాడు. ఐ బొమ్మ, బప్పం టివిల గోల్‌మాల్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. రెండేళ్లకు పైగా ఐ బొమ్మ, బప్పం దేశ వ్యాప్తంగా అనేక భాషల సినిమాలను విడుదలైన గంటల వ్యవధిలోనే ఆన్‌లైన్ ద్వారా నెట్ ద్వారా చూపడం తెలిసిందే. దీంతో సిని వర్గాలు కోట్లాది రూపాయలు నష్టపోయారు. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేయగా దమ్ముంటే తన ను అరెస్టు చేయాలని దీని నిర్వాహకుడు ఇమంది రవి పోలీసులకు సవాల్ విసిరాడు. అయితే పోలీసులు పక్కాగా వ్యవహరించి విదేశీ పౌరసత్వం కలిగిన రవిని వ్యూహాత్మకంగా హైదరాబాద్‌కు రప్పించి అరెస్టు చేసి జైలుకు తరలించడంతో ఐ బొమ్మతో పాటు బప్పం టివిలు మూతపడ్డాయి. ఈ కేసులో రవి రెండు నెలల పాటు జైల్లో వున్న తరువాత కోర్టు షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. ఇతను ఇప్పుడు పోలీసుల ఎదుట క్రమం తప్పకుండా హాజరవుతూ కోర్టు విచారణను ఎదుర్కొం టున్నాడు.

అయితే వారం రోజులుగా ఐ బొమ్మ, బప్పం టివిలు మరోసారి ఆన్‌లైన్ వేదికగా ప్రత్యక్షమవుతుండడం సినీ వర్గాలలో కలకలం రేపింది. కొత్తగా విడుదలైన సినిమాలు గంటల వ్యవధిలోనే ఇందు లో వస్తుండడంతో సినీ వర్గాలు ఆందోళన చెందసాగారు. దీనిపై తెలుగు ఫిలిం ఛాంబర్ పెద్దలు ఆదివారం నాడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వెంటనే కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు. ఐ బొమ్మ, బప్పం టివిలు ఎక్కడి నుంచి పనిచేస్తున్నాయి...? దీనికి సర్వర్లు ఎక్కడి నుంచి అందుతున్నాయి...? దీని వెనుక వున్న వారు ఎవరు...? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. తమ పర్యవేక్షణలో వున్న రవి హస్తం ఇందులో వుందా...? అనే కోణంలో విచారించగా అతని ప్రమేయం లేదని తేలడంతో అసలు నేరగాళ్ల కోసం ఆరా తీస్తున్నారు. మరోవైపు ఐ బొమ్మ, బప్పం టివిలు మళ్లీ ప్రత్యక్షం కావడం వెనుక తన ప్రమేయం ఎంత మాత్రం లేదని, కొందరు నేరగాళ్లు తన వెబ్‌సైట్‌ను వాడుకుని నేరాలకు పాల్పడుతున్నట్లు అతను తెలిపాడు.

# 23న యాదగిరిగుట్ట వేదపాఠశాల శంకుస్థాపన

## సిఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 17:** ఆదివారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి శ్రీ లక్ష్మీనంసింహస్వామి వేదపాఠశాల శంకుస్థాపన కార్యక్రమానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. ఈ నెల 23న యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వేదపాఠశాల, దేవస్థాన ఇతర అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, యాదగిరి గుట్ట ఆలయ ఈవో భవాని శంకర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి సరస్వతి అంత్య పుష్కరాలకు మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. ఈనెల 21 నుంచి జూన్ 1 వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతి అంత్యపుష్కరాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఎంపీ వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వరస్వామి దేవస్థానం ఇఒ మహేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కతో మహిళా కమిషన్ చైర్మన్ విజయలక్ష్మి భేటీ



**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్మన్‌గా నియమితులైన గద్వాల విజయలక్ష్మిని మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క అభినందించారు. ఈ మేరకు ఆదివారం ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కను చైర్మన్ విజయలక్ష్మి కలిశారు. ఈ సందర్భంగా మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. మహిళా కమిషన్ నూతన సభ్యులు కూడా మంత్రి సీతక్కను కలిశారు.

# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌కు వేతనాలు

## కంటిన్యూయేషన్ ఆర్డర్స్ రాకున్నా నిలపవద్దు

## ట్రెజరీ, ప్రభుత్వ శాఖల హెడ్స్‌కు ఆర్థిక శాఖ ఆదేశాలు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఇతర తాతాలిక పద్ధతుల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు వేతనాలు నిలిపివేయవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్స్ ఉద్యోగుల సేవలను పొడిగిస్తూ ఇచ్చే కంటిన్యూయేషన్ ఆర్డర్స్ రావడం ఆలస్యం కావడంతో ఎవరికీ వేతనాలు నిలిపివేయవద్దని ఆర్థికశాఖ స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల కోసం వేచి చూడకుండా జూన్ 30 వరకు తాతాలిక ఉద్యోగుల బిల్లులను ఆమోదించి, రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని ట్రెజరీ, సంబంధిత హెచ్‌వోడీలకు మెమో జారీ చేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఈ మెమోను జారీచేశారు. తాత్కాలిక పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరికీ ప్రతినెలా ఎలాంటి ఆలస్యం లేకుండా రెమ్యునరేషన్ చెల్లించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆ మెమోలో పేర్కొన్నారు. మార్చి 31నాటికి ప్రభుత్వ అనుమతితో తాతాలిక సేవలందిస్తూ, నూతన సంవత్సర పొడిగింపు ఉత్తర్వుల కోసం వేచిచూస్తున్న ఉద్యోగులందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేశారు. డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్, డైరెక్టర్ ఆఫ్ వర్స్ అండ్ అకౌంట్స్, డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఆడిట్, పే అండ్ అకౌంట్స్ ఆఫీసర్ (హైదరాబాద్), రాష్ట్రంలోని డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లు, ఫైనాన్షియల్ ఆఫీసర్లు ఈ తాతాలిక సేవల బిల్లులను జూన్ 30 వరకు తక్షణమే అనుమతించాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, గౌరవ వేతనం, యాక్టివిటీ ఔట్‌సోర్సింగ్, ఎంటీఎస్, డెయిలీ వేజ్, పార్ట్ టైమ్, ఫుల్ టైమ్, గెస్ట్, అవర్లీ బేస్డ్ (గంటల ప్రాతిపదికన) పనిచేస్తున్న ఉద్యోగులందరి సర్వీస్ పొడిగింపు ప్రతిపాదనలను తక్షణమే ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ ద్వారా ప్రక్రియను పూర్తిచేయాలని తెలిపారు.

# ఆస్తి వివాదం నేపథ్యంలో దారుణహత్య

## డిఎస్పీ రాజశేఖర్‌రాజు పరిశీలన

**హాలియా, మే 17, ప్రభాతవార్త:** అనుముల మండలం ఇబ్రహీంపేటలో ఆస్తి వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొన్న దారుణ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రుద్రాక్ష సుమలత (40), ఆమె కూతురు రుద్రాక్ష లావణ్య (20)ను అతికిరాతకంగా హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. సుమలతకు చెందిన ఆస్తి విషయంలో సమీప బంధువులతో కొంతకాలంగా వివాదాలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం తల్లీకూతుళ్లు తమ పామాయిల్ తోటలో పనుల కోసం వెళ్లగా, ముందస్తు పథకం మాటువేసిన నిందితులు వారిపై దాడి చేశారు. కళ్లలో కారంకొట్టి చున్నీతో ఇద్దరి గొంతు నులమగా, ఊపిరాడక తల్లి కూతుళ్లు చనిపోయారు. అనంతరం దుండగులు అక్కడ నుంచి పరారయ్యారు. హత్య జరిగిన విషయాన్ని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సాగర్ సీఐ శ్రీనునాయక్, హాలియా ఎస్ఐ బండి సాయిప్రశాంత్ ఘటనస్థలం వద్దకు చేరుకున్నారు. ఘటనపై మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్‌రాజు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నామని తెలిపారు. ఆస్తి తగాదాలే హత్యకు కారణమని ప్రాథమికంగా నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు. నల్గొండ నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్ రంగంలోకి దించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

# స్వల్పంగా తగ్గిన చికెన్ ధరలు

## హైదరాబాద్‌లో రూ.280లకు కిలో

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** వారం రోజులుగా చికెన్ ప్రియులకు చుక్కలు చూపించిన ధరలు తాజాగా కొద్ది మేర దిగివస్తున్నాయి. ఒకానొక దశలో కేజీ చికెన్ ధర ఏకంగా రూ. 300 నుంచి రూ. 350 వరకు పలకడంతో చికెన్ సెంటర్ల వైపు వెళ్లడానికే సమాన్యులు భయపడే పరిస్థితి వచ్చింది. దాదాపు మటన్ ధరకు చేరువలో చికెన్ రేట్లు ఉండడంతో చాలా మంది చికెన్‌కు ప్రత్యామ్నాయంగా మటన్, చేపల వైపు మొగ్గు చూపారు. అయితే తాజాగా ధరలు కొద్ది మేర తగ్గడంతో చికెన్ షాపులు మళ్లీ కస్టమర్లతో కళకళలాడు తున్నాయి. సాధారణంగా వేసవి కాలం వచ్చిందంటే చికెన్ ధరలు తగ్గుముఖం పడతాయి. ఎండల తీవ్రతకు కోళ్లు త్వరగా చనిపోతాయనే భయంతో పౌల్ట్రీ యజమానులు వాటిని తక్కువ ధరలకే విక్రయిస్తుంటారు. దానికితో ఎండాకాలంలో చికెన్ తినడం వల్ల వేడి చేస్తుందని, ఆరోగ్య సమస్యలు వాస్తయని ప్రజలు కూడా చికెన్‌కు కాస్త దూరంగా ఉంటారు. ఇది కూడా తమ వ్యాపారాన్ని దెబ్బతీస్తుందని వ్యాపారస్తులు ధరలు తగ్గిస్తుంటారు. అయితే ఈ ఏడాది మాత్రం సీన్ రివర్స్ అయింది. వారం రోజులుగా చికెన్ రేట్లు ఆకాశాన్ని తాకాయి. తాజాగా ఆదివారం హైదరాబాద్‌లో కిలో చికెన్ ధర రూ. 250 - రూ. 260 పలకగా, ఖమ్మం లోరూ. 280దాకా పలికింది. అయితే పొరుగు రాష్ట్రంలో ఎపిలోని విజయవాడలో చికెన్ ధర ఇంకా రూ. 300 పైనే కొనసాగు తుండగా తెలంగాణలోని హైదరాబాద్‌తోపాటు ఖమ్మం, వరంగల్ తదితర నగరాల్లో కొద్ది మేర తగ్గి వినియోగదారులకు ఊరటనిస్తోంది.

# పెట్టుబడి ఘనం.. మద్దతు ధర స్వల్పం

### వరి, మొక్కజొన్నకు అరకొరగానే ఎంఎస్‌పి పెంపు

### పత్తి మద్దతు ధర పెంచినా అది దళారులు, వ్యాపారులకే మేలు

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** పెట్టుబడి వ్యయం భారీగా పెరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పంటల కనీస మద్దతు ధరల పెంపుపై అన్నదాతలు పెదవి విరుస్తున్నారు. తాజాగా పెరిగిన కనీస మద్దతు ధరలతో తమకు ఒరిగేది పెద్దగా ఏమీ లేదని అత్యంత ప్రధాన పంటలు వరి, మొక్కజొన్న, పత్తి, కంది సాగు చేస్తున్న రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు పెరిగిన మేరకు పంటలకు మద్దతు ధర లభిస్తుందని భావించినప్పటికీ కేంద్రం సానుకూలంగా నిర్ణయం తీసుకోలేదని అన్నదాతలు వాపతున్నారు. రాష్ట్రంలో వరి, పత్తి తర్వాత అత్యధికంగా సాగయ్యేది మొక్కజొన్న పంటనే. అయితే ఇటీవల కేంద్రం పెంచిన మద్దతు ధరల పెంపులో మొక్కజొన్నకు మొండి చేయి చూపిందన్న విమర్శలు అన్నదాతల నుండి వ్యక్తమవుతున్నాయి. మొక్కజొన్న మద్దతు ధరను క్వింటాకు రూ.10 మాత్రమే పెంచడంపై రైతాంగం అసంతృప్తిగా ఉంది. గతేడాది మొక్కజొన్న ఎంఎస్‌పి రూ.2400 ఉండగా కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు క్వింటాకు రూ.10మాత్రమే పెంచడం గమనార్హం. ఇక రాష్ట్రంలో ఖరీఫ్, రబీలో అత్యధికంగాసాగయ్యే వరి పంటకూ కనీస మద్దతు ధర పెంపు విషయంలో కేంద్రం సహేతుకమైన నిర్ణయం తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

రాష్ట్రంలో వానాకాలం, యాసంగిలో కలిపి 60లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. రాష్ట్రంలో అత్యధికంగా సాగవుతున్న పంట వరినే. గతేడాది సాధారణ వరి రకానికి రూ.2369, ఏ-గ్రేడ్ రకానికి రూ.2389 కనీస మద్దతు ధర పలికింది. ప్రస్తుతం ఈ రెండు రకాల వరి ధాన్యానికి రూ.72మేర మాత్రమే మద్దతు ధర పెరిగింది. ఏటా వరి సాగు పెట్టుబడి, యంత్రాల అద్దె ఖర్చులు పెరిగిపోతున్న నేపథ్యంలో అందకనుగుణంగా మద్దతు ధర పెరగకపోవడంతో రైతులు నిరుత్సాహంగా ఉన్నారు.

ఇక.. గతేడాది క్వింటా పత్తి కనీస మద్దతు ధర రూ.8110 ఉండగా దీన్ని కేంనరద ప్రభుత్వం రూ.8667 కు పెంచింది. రాష్ట్రంలో ఏటా 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతోంది. భారీగా పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్నా దిగుబడులు తగ్గటం, గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. పంట చేతికి రాగానే తక్కువ ధరకు దళారులు, ప్రయివేటు వ్యాపారులు తన్నుకుపోతున్నారు. అయితే రైతులు తాము పండించిన పత్తి పంటనంతా అమ్ముకున్న తర్వాత మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటా పత్తి రూ.9వేలు పలుకుతోంది. పంట చేతికొచ్చిన సమయంలో ఎంఎస్‌పి లభించకపోవడంతో అన్నదాతలు నష్టపోయారు. ఇక పప్పు ధాన్యాల మద్దతు ధరను కూడా నామ మాత్రంగానే పెంచారని అన్నదాతలు చెబుతున్నారు. గతేడాది క్వింటా పెసలుకు రూ.8768 మద్దతు ధర ఉండగా ఈ ఏడాది రూ.12మాత్రమే పెరిగింది. కందులకు గతేడాది క్వింటాకు రూ.8వేల మద్దతు ధర ఉంటే తాజాగా రూ.450 పెంచింది. మినుములకు రూ.7800 నుండి రూ. 8200కు మద్దతు ధర పెరిగింది.

అయితే మద్దతు ధరల పెంపులో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సిఫారసులను సైతం కేంద్ర ప్రభుత్వం పరిగణనలోనికి తీసుకోలేదని వ్యవసాయశాఖవర్గాలు పేర్కొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం మినహా పంట కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో ఆ భారం రాష్ట్ర ప్రభుత్వం పడుతోంది.

## భగీరథ్ సరెండర్ అయ్యారు.. రాష్ట్ర పోలీసులే చూసుకుంటారు

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 17:** బండి భగీరథ్ ఎపిసోడ్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. భగీరథ్ పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారని గుర్తు చేశారు. ఇక దానిపై చర్చించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఈ కేసు విచారణ ఏదైనా ఉంటే పూర్తిగా తెలంగాణ పోలీసుల పరిధిలోనే ఉంటుందని స్పష్టం చేశారు. ఆదివారం రాష్ట్ర పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈ కేసుతో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. పూర్తిగా రాష్ట్ర పోలీసులే ఈ వ్యవహారాన్ని చూసుకుంటారని వివరించారు. పశ్చిమబెంగాల్ పర్యటనలో భాగంగా అమిత్‌షా, యోగి ఆదిత్య నాథ్‌లను ఆ రాష్ట్ర పోలీసులు గతంలో అడ్డుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వాలకు అంతటి స్వతంత్ర వ్యవస్థ ఉంటుందని.. భగీరథ విషయంలో ఎలాంటి విచారణ అయిన చేయొచ్చని కిషన్‌రెడ్డి తేల్చి చెప్పారు.

## నేటి నుంచి క్రీడా, యువజన వారోత్సవాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 17:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం క్రీడా, యువజన వారోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మే 18 నుండి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న యువజన, క్రీడా వారోత్సవాలు కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 6 గంటలకు ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, బీసీ, రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయష్ రంజన్‌లతో కలిపి ప్రారంభిస్తారు. ఎల్ బి టెన్నిస్ కాంప్లెక్స్ వద్ద మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ జండా ఊపి ప్రారంభించే వాకథాన్ కార్యక్రమంలో దాదాపు 2000 పైగా యువ క్రీడాకారులు పాల్గొంటారు. ఎల్బీ స్టేడియం, బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్, ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం, బురుగుల రామకృష్ణారావు భవనం, ఈగల్ సర్కిల్ ఆర్బీఐ అసెంబ్లీ కంట్రోల్ రూమ్ మీదుగా ఎల్బీ ఇండోర్ స్టేడియం వరకు కొనసాగుతుంది. తదుపరి ఎల్బి ఇండోర్ స్టేడియంలో దివ్యాంగులకు మహిళలకు సీనియర్ సిటిజన్స్‌కు యోగ మెడిటేషన్ కార్యక్రమం నిర్వహిస్తారు.

## భక్తులతో తిరుమలకొండ కిటకిట

- వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు

**తిరుమల, మే 17 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం లక్షమంది భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిట లాడుతోంది. వేసవి సెలవులు.. ఆపై వారాంతం శని, ఆదివారాలు కలసి రావడంతో ఆదివారం ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపలకు శిలాతోరణం వరకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 18 గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 8గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. అసలే వేసవి సెలవులు... ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది.

## గురుకులాలు, వసతిగృహ పాఠశాలలకు నిధుల విడుదల

### నెలవారీ చెల్లింపుల విధానం అమలు

### రూ. 221.24 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 17:** రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహ పాఠశాలల నిర్వహణకు ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ సంక్షేమం, విద్యా శాఖల పరిధిలోని నివాస విద్యాసంస్థలకు సంబంధించిన ఆహార వ్యయాలు (డైట్ చార్జీలు), కాస్మెటిక్స్ ఖర్చులు, భవన అద్దెలను ఇకపై ప్రతి నెలా సకాలంలో విడుదల చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సామాజికంగా వెనుకబడిన, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా ఈ అడుగు వేసింది. గతంలో ఈ నిధుల చెల్లింపుల్లో 8 నుంచి 9 నెలల వరకు ఆలస్యం కావడం వల్ల నివాస పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇందులో భాగంగా మొదట త్రైమాసిక (మూడు నెలలకోసారి) చెల్లింపుల విధానాన్ని తీసుకువచ్చి, ప్రస్తుతం దాన్ని నెలవారీ చెల్లింపుల విధానంగా మార్చారు. 2026-27 బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలోనే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ కీలక మార్పును ప్రకటించడం గమనార్హం. ఈ నిర్ణయం వల్ల విద్యార్థులకు నిరంతరాయంగా పోషకాహారం అందడంతో పాటు హాస్టళ్ల సక్రమ నిర్వహణ, భవనాల అద్దెల చెల్లింపులు సాఫీగా సాగనున్నాయి. ఇది విద్యార్థుల విద్యా ఫలితాలను, పాఠశాలల వాతావరణాన్ని మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడుతుంది. నెలవారీ చెల్లింపుల నిర్ణయంలో భాగంగా.. వివిధ సంక్షేమ, విద్యా శాఖల పరిధిలోని వసతి గృహ విద్యాసంస్థల ఆహార, కాస్మెటిక్స్ ఖర్చులు, భవన అద్దెల కోసం ప్రభుత్వం రూ.221.24 కోట్లను విడుదల చేసింది. ఈ నిధుల విడుదల ద్వారా వసతి గృహ పాఠశాలల్లోని విద్యార్థుల పోషణ, సంక్షేమం, వసతి సదుపాయాలకు పూర్తి స్థాయిలో నిరంతర మద్దతు లభించనుంది. 'అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన నివాస సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, సాధికారత సాధించడమే కాకుండా, వారిని సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## మసాజ్ పేరిట మహిళలపై భారతీయుడి వేధింపులు

### ఆస్ట్రేలియాలో 13 యేళ్ల జైలుశిక్ష

**కాన్‌బెర్రా, మే 17:** మసాజ్ పేరుతో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ భారతీయ సంతతి వ్యక్తికి ఆస్ట్రేలియాలోని కోర్టు భారీ శిక్ష విధించింది. 13 సంవత్సరాల 10 నెలల జైలు శిక్ష విధిస్తూ తాజాగా తీర్పు వెల్లడించింది.



నిందితుడు సుమిత్ సతీష్ రస్తోగి (39) మహిళల్ని వేధించినట్లు కోర్టు గుర్తించడంతో అతడికి ఈ శిక్ష వేసింది. ఒక అంతర్జాతీయ మీడియా కథనం ప్రకారం.. న్యూఢిల్లీకి చెందిన సుమిత్ 2011లో ఆస్ట్రేలియా వెళ్లాడు. అక్కడ అడిలైడ్ సిటీలోని గ్లెన్‌లెగ్‌లో ఒక మసాజ్ పార్లర్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో 2021, అక్టోబరు నుంచి 2022 జూలై వరకు.. అంటే ఈ తొమ్మిది నెలల కాలంలో దాదాపు 61 మంది మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. మసాజ్ చేయించుకుంటున్న వారిని అసభ్యంగా విడియోలు తీయడం, అసభ్యంగా తాకడం వంటి 97 నేరాలకు పాల్పడ్డాడు. ఇతడి వేధింపులకు గురైన బాధిత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సుమిత్ దారుణాలు వెలుగులోకి వచ్చాయి. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. అతడిని 2022 జూలైలో అరెస్టు చేశారు. ఇంతకాలం ఈ కేసు విచారణ కొనసాగింది. విచారణలో అతడు నేరం చేసినట్లు రుజువైంది. సుమత్ వేధింపులకు గురైన మహిళలు తీవ్ర మనోవేదనకు గురైనట్లు కోర్టు గుర్తించింది. అతడి నేరాలకు కోర్టు 13 సంవత్సరాల 10 నెలలపాటు జైలు శిక్ష విధించింది. ఇందులో పదేళ్ల పది నెలల పాటు పెరోల్ పొందడానికి వీలు లేకుండా కోర్టు తీర్పు ఇచ్చింది. అంటే, 2035 వరకు అతడికి పెరోల్ లభించదు. ఇప్పటికే కొంతకాలం అతడు జైలులో ఉన్నందున ఆ కాలాన్ని కూడా శిక్షగా పరిగణిస్తారు. ఈ జైలు శిక్ష కాలాన్ని పరిగణనలోకి తీసుకుని 2035లోనే పెరోల్ లభిస్తుంది. ఇక, సుమిత్ తన పూర్తి శిక్ష అనుభవించిన తర్వాత అతడిని ఆస్ట్రేలియా నుంచి తిరిగి ఇండియా పంపేయాలని కూడా కోర్టు ఆదేశించింది.

## 'సర్'పై కలవరం!

>> ఎలాగైనా తెలంగాణలో పాగావేసే ఉద్దేశ్యంతో అన్ని నియోజకవర్గాలలో బిఎల్‌ఎలను నియామం చేసుకొనే దిశగా అడుగులు వేస్తోంది. ప్రీ ఎస్ఐఆర్ ప్రక్రియలోనే తెలంగాణ వ్యాప్తంగా అనేక సమస్యలు బిఎల్‌వోతో రావడంతో రాజకీయపార్టీలు అనిశ్చితికి గురవుతున్నాయి. తెలంగాణలో బిఎల్‌ఓలుగా నియామకమైనవారిలో అత్యధికులు ఇంగ్లీషులో చదవడం, రాయడం రానివారు కావడంతో వారి లాగిన్ వివరాలు తీసుకొని కొంతమంది రాజకీయ పార్టీల నాయకులు అర్ధరాత్రి మ్యాపింగ్ ధృవీకరణలు చేస్తున్నారనీ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.రాజకీయనాయకుల ప్రభావం తగ్గించడానికి ఎలక్షన్ కమీషన్ బూత్‌లెవల్ ఏజెంట్లకు శిక్షణ ఇవ్వాలని తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ డిమాండ్‌ను బలంగా వినిపిస్తోంది. ఎన్నికల సంఘం ప్రతి నియోకవర్గంలో ఇన్ని ఓట్లు తీసేయాలనే ఆదేశాలకు అనుగుణంగా పౌరసత్వనిరూపణ కోసం ఒత్తిడి చేసే అంశంపై కూడా కాంగ్రెస్‌పార్టీ బిఎల్ఎను చైతన్య పరుస్తోంది . అందులో కొన్ని వర్గాలు నివసించే ప్రాంతాలపై ఫోకస్ చేసే అవకాశం ఉందనీ అక్కడ అర్హుల ఓట్లు కోల్పోకుండా చూడాలని ఇప్పటికే కింది స్థాయి కార్యకర్తకు సమాచారం అందించారు. బిఎల్‌ఓలు ఒకటికి రెండు,మూడు మార్లు ఇంటికి వెళ్లి పరిశీలన చేసిన తర్వాత డబుల్ ఓటు, మరణించిన లేదా వలస వెళ్లిన అంశాలను ధృవీకరించుకుని సవరిస్తున్నారాలేదా అంశంపై కూడా బిఎల్ఎలు దృష్టిసారించేలా తర్ఫీదు కాంగ్రెస్ ఇస్తున్నది. రాజకీయపార్టీల సౌజన్యంతో బిఎల్‌ఓలు కార్యాలయాల్లో కూర్చుని అర్హులకు ఓటును తొలగించకుండా నోటీసులు ముందుగా వారికి ఇచ్చేలా ఒత్తిడి పెంచేందుకు బిఎల్ఎలను సమాయత్తం చేస్తున్నారు. అకారణంగా తొలగింపునకు గురైన ఓటర్లకు తిరిగి అప్పీల్ చేసుకోవటం, ధరకాస్తు చేసుకునేందుకు మూడు నెలల సమయం ఖచ్చితంగా ఇచ్చేలా ఎన్నికల కమీషన్, జిల్లా కలెక్టర్లపై కాంగ్రెస్ పార్టీ విన్నపాలతో ఒత్తిడి పెంచుతోన్నది తెలంగాణ వ్యాప్తంగా ప్రతి బూత్ స్థాయిలో జరిగే సవరణ కార్యక్రమాన్ని పార్టీ కార్పోరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ బాధ్యుతలు పని విభజన చేసుకుని,బూత్‌స్థాయి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలనీ కాంగ్రెస్‌పార్టీ స్పష్టమైన ఆదేశాలు కిందివరకు తీసుకెళ్ళింది. అధికారులు ఉద్దేశపూర్వకంగా ఎక్కడైనా ఓట్లు తొలగిస్తే బూత్ అధికారి నుండి ఆర్‌ఒడీ, జిల్లా కలెక్టర్‌నుండి రాష్ట్ర ఎన్నికల కమీషన్ వరకు ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌ఫిర్యాదులు చేయడానికి ప్రతి శాసనసభ మండలం, నియోజకవర్గం వారిగా ఫిర్యాదులు కమిటీలు కాంగ్రెస్‌పార్టీ ఏర్పాటు చేసుకోంటున్నది. ఇవిఎంలతోపాటు కొత్తగా సర్‌తో చేపట్టబోయే "ఓటుచోరి" నియంత్రణకు కార్యకర్తలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో బెంగాల్,అస్సాం మిజోరంలో భారత ఎన్నికల కమీషన్ ఒంటెద్దు పోకడ ఇక్కడ సాగకుండా నీరు గార్చేందుకు పటిష్టమైన ఏర్పాటు చేసుకొంటున్నారు. దీనికి తోడు బిఆర్ఎస్ కూడా సర్‌కు అత్యంత ప్రాముఖ్య ఇస్తోంది. 2029లో అధికారంలోకి మళ్ళీవస్తామనే ధీమాతో ఉండటంతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఫారం ఏడు దుర్వినియోగం చేయకుండా చూస్తోంది. ముఖ్యంగా తెలంగాణ వ్యాప్తంగా ఇటు ఆంధ్రప్రదేశ్,తెలంగాణలో రెండేసి చోట్ల ఓటుహక్కు ఉన్నవారిని కూడా తొలిగించాలని బిఆర్ఎస్ ఎన్నికల సంఘంపై ఒత్తిడి తీసుకొస్తోంది. చాలా రాష్ట్రాల్లో, ఫారం 7 ద్వారా బల్క్ తొలగింపు అభ్యర్థనలు మరణం లేదా వలస వంటి తప్పుడు కారణాలపై దుర్వినియోగం చేయబడ్డాయనీ ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తంచేస్తోన్నాయి.

## 2026-27లో జెఎన్‌టియు పరిధిలో 135 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు గుర్తింపు

### ముగిసిన ఎఫ్ఎఫ్‌సి తనిఖీలు

### త్వరలో అనుబంధ గుర్తింపు

### ఇవ్వనున్న యూనివర్సిటీ

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టియు) పరిధిలో రానున్న 2026-27 విద్యా సంవత్సరంలో 135 ఇంజనీరింగ్ కాలేజీలకు యూనివర్సిటీ గుర్తింపు ఇవ్వనుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా ఇప్పటికే యూనివర్సిటీ తరపున నిర్వహించాల్సిన ఫైండ్ ఫ్యాక్టింగ్ కమిటీ(ఎఫ్ఎఫ్‌సీ) తనిఖీలను యూనివర్సిటీ పూర్తి చేసింది. సుమారు 135 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలను నిర్వహించింది. ఆయా కాలేజీల్లో ఉన్న లోపాలు, లోటుపాట్లు, ఇతర ల్యాప్సెస్‌ను సూచిస్తూ యూనివర్సిటీ ఒకటి, రెండు రోజుల్లో ఆయా కాలేజీలకు లేఖలు పంపించనున్నట్టు తెలిసింది. యూనివర్సిటీ పంపిన లేఖలు యూనివర్సిటీలు తిరిగి సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఆయా కాలేజీల నుంచి వచ్చిన వివరణ ఆధారంగా కాలేజీలకు రానున్న 2026-27 విద్యాసంవత్సరానికి యూనివర్సిటీ నుంచి అనుబంధ గుర్తింపును ఇవ్వనున్నారు. ఆదివారం ఎప్ సెట్-2026 ఫలితాలను విడుదల చేసిన నేపథ్యంలో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లను చేపట్టాల్సి ఉన్నందున.. యూనివర్సిటీ తమ పరిధిలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపును ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎఫ్ఎఫ్‌సీ తనిఖీలు ముగిసినందున వారంలోపుగానే కాలేజీలకు యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఏడాది ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో కొత్త కోర్సులకు అనుమతి ఇవ్వడం లేదని జేఎన్‌టియు ఉన్నతాధికారి తెలిపారు. అలాగే కోర్సు కన్వర్షన్‌కు కూడా యూనివర్సిటీ నుంచి అనుమతి ఇవ్వడం లేదని తెలిపారు. కొత్త కోర్సులకు అనుమతి, కోర్స్ కన్వర్షన్‌లకు అనుమతులను ప్రభుత్వం ఇవ్వొద్దని చెప్పిన నేపథ్యంలోనే వాటికి అనుమతులు ఇవ్వడం లేదు.

## వైటిపిఎస్‌లో అగ్నిప్రమాదం.. దగ్ధమైన కేబుళ్లు

### ఆస్తి నష్టం.. 3 రోజుల క్రితమే ఉత్పత్తి ప్రారంభించిన 3వ యూనిట్

### సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెనుముప్ప

**మిర్యాలగూడ, మే 17, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని ప్రతిష్టాత్మక యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్ (వైటిపిఎస్)లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవిం చింది. మూడు రోజుల క్రితమే ఉత్పత్తి ప్రారంభించిన 3వ యూనిట్లో విద్యుత్ ఆయిల్ లీకేజి, షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సమాచారం. షార్ట్ సర్క్యూట్ జరిగిన వెంటనే దట్టమైన పొగలు, మంటలు వ్యాపించడంతో ప్లాంట్‌లో పనిచేస్తున్న సిబ్బంది ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ప్రమాదం గుర్తించిన అధికారులు అగ్నిమాపక సిబ్బందిని అప్రమత్తం చేయగా ఫైర్ సేఫ్టీ పరికరాల సహాయంతో మంటలను వెంటనే అదుపులోకి తెచ్చారు. దీంతో మంటలు ఇతర విభాగాలకు వ్యాపించకుండా అడ్డుకోవడంతో పెద్దప్రమాదం తప్పింది.

అధికారుల అప్రమత్తతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కంట్రోల్ కేబుల్స్, వాల్వ్‌లు దెబ్బతిన్నప్పటికీ మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించ కుండా సకాలంలో చర్యలు తీసుకోవటంతో ప్రధాన యంత్రాలకు ముప్పు తప్పింది. పంపు వద్ద ఆయిల్ లీకేజీ కావడం, షార్ట్ సర్క్యూట్ జరగటం వల్ల ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసిన అధికారులు, విచారణ చేపట్టారు. మూడు రోజుల క్రితమే మూడవ యూనిట్ సిఓడి (సింక్రోనైజేడ్) పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించగా స్వల్ప వ్యవధిలోనే ప్రమాదం చోటు చేసుకోవడం గమనార్హం.



గతంలో కూడా యూనిట్ 1 లో అగ్ని ప్రమాదం జరిగి భారీ ఎత్తున ఆస్తి నష్టం సంభవించింది. 4000 మెగా యూనిట్ల ఉత్పత్తి సామర్థంతో చేపట్టిన యాదాద్రి థర్మల్ పవర్ లో 8 యూనిట్ల ఉత్పత్తి సామర్థం గల 5 యూనిట్లను నిర్మిస్తున్నారు. దీనిలో 1, 2,4వ యూనిట్ల లో ఉత్పత్తి ప్రారంభం కాగా, మూడు రోజుల క్రితమే మూడవ యూనిట్ ను ప్రారంభించడం జరిగింది. మిగిలిన 5వ యూనిట్ త్వరలో పూర్తి కానుంది. 29వేల కోట్లతో ప్రారంభించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నిర్ణీత సమయానికి పూర్తి కాకపోవటంతో పాటు, ప్రభుత్వాలు మారటం, యంత్రాల ధరలు పెరగడంతో అంచన వ్యయం దాదాపు 55 వేల కోట్లకు చేరుకున్నట్లు సమాచారం. దీనికి తోడు వరుస ప్రమాదాలతో వ్యయం మరింతగా పెరిగి. ప్రభుత్వానికి గుదిబండలా తయారవుతుందని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

## పచ్చ బంగారం ధరలు ఢమాల్

### ఆరుగాలం కష్టపడినా పసుపునకు దక్కని గిట్టుబాటు ధర

### యుద్ధం దెబ్బకు నిలిచిన ఎగుమతులు

### పెట్టుబడి వ్యయం కూడా రాదని రైతన్నల ఆవేదన

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** చేను నిండా పచ్చగా పండి, రైతు ఇంట్లో లక్ష్మీదేవిలా కలకలాడాల్సిన పచ్చ బంగారం (పసుపు) ఈ ఏడాది రైతన్నల కళ్లల్లో నీళ్ల తెప్పిస్తోంది. ఆరుగాలం శ్రమించి, రక్తాన్ని చెమటగా మార్చి పండించిన పంటకు మార్కెట్‌లో కనీస ధర కూడా పలకకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. ఒకవైపు ప్రకృతి సహకరించక దిగుబడి తగ్గితే మరోవైపు అంతర్జాతీయంగా జరుగుతున్న యుద్ధాల ప్రభావం పసుపు రైతుల నడ్డి విరిచింది. రాష్ట్రంలో ప్రధానంగా నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, మహబూబాబాద్ తదితర జిల్లాల్లో పసుపు పంట ఎక్కువగా పండిస్తారు. జూన్, జూలైలో తొలకరి వర్షాలతో నాట్లు ప్రారంభించి సుమారు 9 నెలల పాటు ఈ పంటను సాగు చేస్తారు. సారవంతమైన నల్ల రేగడి నేలలు పసుపు సాగుకు ఎంతో అనుకూలం. జూన్ , జూలై నెలల్లో విత్తనాలు నాటుతారు. నిజామాబాద్ రైతులు ఎక్కువగా బెడ్ విధానం ద్వారా పసుపు సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో తక్కువ ఖర్చుతో 40శాతం ఎక్కువ దిగుబడి వస్తుందని చెబుతున్నారు. పసుపు పంట కాలం సుమారు 9 నెలలు. రాష్ట్రంలో అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో పసుపు సాగవుతోంది. ఆ తర్వాత మన ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మార్కెట్‌లో పసుపు సాగు పెద్ద విస్తీర్ణంలో ఉంది. అయితే ఒకప్పుడు క్వింటా పసుపు ధర రికార్డు స్థాయిలో రూ.18,000 పలకడంతో రైతులంతా పసుపు సాగును ఉత్సాహంగా చేపట్టారు. కొన్నేళ్లుగా ధరలు రూ.7,000 నుండి రూ.8,000 దాటకపోవడం, పెట్టుబడులు విపరీతంగా పెరగడంతో రైతులు పసుపు సాగును తగ్గించేశారు. అయిదేళ్ల క్రితం మహబూబాబాద్ జిల్లాలో 10 వేల ఎకరాల్లో ఉన్న పసుపు సాగు, ఈ ఏడాది కేవలం 5 వేల ఎకరాలకు పడిపోవడమే ఇందుకు నిదర్శనం. ఇక ఈ ఏడాది పసుపు పంట చేతికొచ్చిన తరుణంలో ఇరాన్ దేశంలో నెలకొన్న యుద్ధ వాతావరణ పరిస్థితుల్లో రెండు నెలలుగా ఎగుమతులు పూర్తిగా ఆగిపోయాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. విదేశాలకు ఎగుమతి కాకపోవడంతో కేవలం దేశీయ మార్కెట్ అవసరాల కోసమే వ్యాపారులు కొనుగోళ్లు జరుపుతున్నారు. దీంతో డిమాండ్ తగ్గి ధరలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. ప్రస్తుతం నిజామాబాద్, వరంగల్ కేసముద్రం మార్కెట్‌లో ఈనాం వేలంలో పసుపు క్వింటాకు గరిష్టంగా రూ.13,208 పలుకుతుండగా, నాణ్యత లేని పంటకు కనీస ధర రూ.6,000 మాత్రమే ఇస్తున్నారు. సగటున చూసుకుంటే రూ.11,000 నుండి రూ.12,000లోపే వ్యాపారులు ధర పెడుతున్నారు. గోల రకానికి రూ.11,200, కాడీ రకానికిరూ.11,399 సగటు ధర లభిస్తోంది. వాస్తవానికి పసుపు అనేది సాధారణ పంట కాదు. దాదాపు ఏడాది పాటు పిల్లలా సాకాల్సిన పంట. దీనికి పురుగుల బెడద ఎక్కువ, ఖర్చులూ ఎక్కువే. ఎకరానికి దాదాపు రూ. 1.5 లక్షల వరకు పెట్టుబడి అవుతోందని రైతులు వాపోతున్నారు. వారం రోజుల క్రితం రూ.14,000 పలికిన ధర ఇప్పుడు ఉన్నఫళంగా రూ.10,000 కి పడిపోవడంతో దళారుల ఆన్‌లైన్ మాయాజాలం వల్ల తాము నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాకు రూ.20,000 ఇస్తేనే పసుపుసాగు గిట్టుబాటు అవుతుందని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పసుపు రైతులను ప్రత్యేకంగా ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

## కఠినంగా ఫిజిక్స్ ప్రశ్నలు .. సులువుగా కెమిస్ట్రీ, సాధారణంగా గణితం

### ప్రశాంతంగా ముగిసిన జెఇఇ అడ్వాన్స్‌డ్

### 25న ప్రాథమిక కీ.. జూన్ 1న ఫలితాలు

### అడ్వాన్స్‌డ్‌ను నిర్వహించిన ఐఐటీ రూర్కీ

**హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త:** ఆదివారం దేశవ్యాప్తంగా జరిగిన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఫిజిక్స్ ప్రశ్నలు కఠినంగా, లెంగ్తీగా ఉన్నాయని, కెమిస్ట్రీ ప్రశ్నలు మాత్రం సులభతరంగా వచ్చినట్టు విద్యార్థులు, జేఈఈ నిపుణులు తెలిపారు. గణితం ప్రశ్నలు గత ఏడాది కంటే సులభతరంగా ఉన్నాయని చెప్పారు. జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 పరీక్ష ఆదివారం దేశవ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. ఐఐటి రూర్కీ నిర్వహించిన 2026 జేఈఈ అడ్వాన్స్‌డ్‌పై విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం ఫిజిక్స్‌లో సుదీర్ఘమైన, గణనలతో కూడిన సంఖ్యాత్మక ప్రశ్నల కారణంగా అత్యంత కఠినంగా ఉందన్నారు. కెమిస్ట్రీ అత్యంత సులభమైనదిగా ఎక్కువ స్కోరింగ్ సాధించేదిగా ఉందన్నారు. గణితం సుదీర్ఘంగా ఉన్నప్పటికీ, గత సంవత్సరాలతో పోలిస్తే కొంచెం సులభంగా అనిపించిందని చెప్పారు. కెమిస్ట్రీ ఎక్కువ స్కోరింగ్ సాధించే విభాగంగా విస్తృతంగా పరిగణించబడిందని, ఫిజికల్, ఆర్గానిక్, ఇనార్గానిక్ విభాగాల నుండి ప్రశ్నలు సమతుల్యంగా ఉన్నాయం టున్నారు. ఫిజిక్స్ రెండు పేపర్లలోనూ అత్యంత కఠినమైన సబ్జెక్టుగా రేట్ చేయబడిందని, అధికంగా సంఖ్యాత్మక గణనలతో కూడిన ప్రశ్నలు వచ్చాయన్నారు. ఐఐటీల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశ వ్యాప్తంగా నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్(జేఈఈ) అడ్వాన్స్‌డ్-2026 పరీక్షను ఆదివారం నిర్వహించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కి దేశ వ్యాప్తంగా సుమారు 1.80 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది. పేపర్-1 పరీక్షను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించగా.. పేపర్-2 పరీక్షను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 45 వేల మందికిపైగా హాజరైనట్టు తెలుస్తోంది. 2025-26 విద్యా సంవత్సరంలో 23 ఐఐటీల్లో 18,160 ఐఐటీ సీట్లు అందుబాటులో ఉండగా ఈ ఏడాది అదనంగా మరో 300 సీట్లు పెరిగే అవకాశముంది. తెలంగాణలో 13 నగరాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కి సంబంధించి ఈ నెల 21న వెబ్‌సైట్లో అభ్యర్థుల ఓఎంఆర్ పత్రాలను అందుబాటులో ఉంచనున్నారు. ఈ నెల 25న ప్రాథమిక కీ విడుదల చేస్తారు. జూన్ 1న తుది కీతోపాటు తుది ఫలితాలు విడుదల చేయనున్నారు. జూన్ 2 నుంచి జాయింట్ సీట్ అలకేషన్(జోసా) కౌన్సెలింగ్ ప్రారంభించి జులై 24 వరకు కొనసాగించనున్నారు.

